గ్రామాల్లో సమస్యల తిష్ట


- నందిపేటలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



ఐలమ్మ విగ్రహం వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



నందిపేటలోని రాజానగర్ కాలనీలో ఇళ్ల చుట్టూ చేరిన మురుగు నీరు



నందిపేటలో పగలు వెలుగుతున్న వీధిదీపాలు

నందిపేట్(ఆర్మూర్): గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి ప్రజలు రోగాల బారినపడుతున్నారు. ప్రజా ప్రతినిధుల పాలనలో నిర్లక్ష్యానికి గురైన సమస్యలు ప్రత్యేకాధికారుల పాలనలో మరింత పెరిగిపోయాయి. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వసతులలేమితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంకటేశ్వర కాలనీ, రాజానగర్ కాలనీలోని కెనాల్ కట్ట ప్రాంతంలో మురుగు కాలువలు లేక రోడ్లపైనే మురుగు నీరు ప్రవహించి ఇళ్ల చుట్టూ గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు పందులకు నిలయమై కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారు. డ్రెయినేజీ సరిగ్గా లేక తాగునీటి పైపుల నుంచి వచ్చిన నీరు నిలిచిఅపరిశుభ్రంగా మారుతుంది. రోడ్లపైనే మురుగు నీరు ప్రవహిస్తుంది. మురికి కాల్వలను శుభ్రపరచడం, పిచ్చిమొక్కలను తొలగించడం, వీధులను ఊడ్చడం, మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయడం, తాగునీటి పైపులైన్ల లీకేజీలను సరిచేయడం లాంటి పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలి. ఈ పనులన్ని చేపట్టేందుకు అవసరమైన నిధులు కొంత మేర ప్రభుత్వం సమకూర్చగా, మిగతా పన్నుల రూపేణ వసూలు చేయాలి. గ్రామాలలో పన్నులు వసూలు కాక సమస్యలు పరిష్కరించడం లేదు.

పారిశుధ్యం అధ్వానంగా మారింది

కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఇళ్ల చుట్టూ మురుగు నీరు చేరడంతో పందులకు నిలయంగా మారింది. దోమల బెడద నెలకొంది. దీంతో రోగాల బారిన పడుతున్నాం. సమస్యలను అధికారులు పట్టించుకోవటం లేదు.

– శేఖర్‌రెడ్డి, రాజానగర్ కాలనీ

కనీస సౌకర్యాలు లేవు

కాలనీలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు, నాయకులకు విన్నవించిన పట్టించుకోవటం లేదు. విద్యుత్ దీపాలు, తాగు నీరు, మురుగు కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం. – మేకల శ్రీను, వెంకటేశ్వర కాలనీ

పర్యవేక్షిస్తున్నాం

గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. గ్రామ కార్యదర్శుల నుంచి నివేదికలు తీసుకొని సమస్యలను పరిష్కరిస్తున్నాం. ప్రజలు సకాలంలో పన్నులు కట్టి గ్రామాలభివృద్ధికి తోడ్పడాలి.

– శ్రీనివాసరావు, ఎంపీడీవో, నందిపేట

ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం

- ఘనంగా సాలూర జెడ్పీహెచ్ఎస్ వార్షికోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన



కోటగిరిలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



సాలూరలో మాట్లాడుతున్న ఎంఈవో రాజీ మంజూష

బోధన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని సాలూర ఎంఈవో రాజీ మంజూష అన్నారు. పీఎం శ్రీ పాఠశాలగా సాలూర జెడ్పీహెచ్ఎస్ ఎంపికైనందున రూ. 2 కోట్ల వరకు నిధులు రానున్నాయని పేర్కొన్నారు. మంగళవారం సాలూరలో నిర్వహించిన జెడ్పీహెచ్ఎస్ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహసీల్దార్ శశిభూషణ్ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దిక్సూచీ ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, మాజీ ఉప సర్పంచ్ సరిడే సాయి లు, పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, విశ్రాంత ఉపాధ్యాయుడు గంగారాం, ఉపాధ్యాయ బృందం, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటగిరిలో..

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ డే, ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అకట్టుకున్నాయి. ఎంఈవోలు ఎన్. శ్రీనివాస్ రావు, లోల శంకర్, కట్ట శ్రీనివాస్, కోటగిరి మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు బర్ల సాయిలు, ఉదయ చందర్, సుమన సుచిత్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు

ఆర్మూర్‌టౌన్/నవీపేట : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలపొందడంతో ఆర్మూర్ పట్టణం, నవీపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు.కార్యకర్తలు టపాసులు పేల్చి, స్వీట్లు పంచారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న నవీన్ కుమార్

రుద్రూర్: ఖాతాదారుల కోసం బ్యాంకు అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ నవీన్‌కుమార్ సూచించారు. రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం గ్రామీణ తెలంగాణ బ్యాంకు పదో వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ బ్యాంకు 930 శాఖల ద్వారా ఖాతాదారులకు ఉత్తమ సేవలందించడంలో బెస్ట్ గ్రామీణ బ్యాంకు అవార్డు సాధించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంవో అజయ్, ఎస్ఎండీ అనిల్ కుమార్, హబ్ మేనేజర్ సతీష్, స్థానిక బ్యాంకు మేనేజర్ సంపత్, క్యాషియర్ గజానంద్, చేనేత సంఘం అధ్యక్షుడు మోత్కురి నారాయణ, సమీప గ్రామీణ బ్యాంకు మేనేజర్‌లు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

ఆర్మూర్‌టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు శిక్షను ఆర్మూర్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ మంగళవారం తెలిపారు. డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఆర్మూర్ పట్టణానికి చెందిన దాసు అనే వ్యక్తికి జడ్జి రెండు రోజుల జైలు శిక్షను విధించారన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు.

ఆడపిల్లల చదువు దేశ అభివృద్ధికి మూలం

ఆర్మూర్‌టౌన్: ఆడపిల్లల చదువు దేశ అభివృద్ధికి మూలమని జిల్లా మహిళ శక్తి కేంద్రం సభ్యులు సౌమ్య, పుష్పలు అన్నారు. మంగళవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బేటి బచావో, బేటీ పడావో కార్యాక్రమంలో భాగంగా చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ, టీచర్లు ఉన్నారు.

ఆధ్యాత్మకం

■ సిద్ధుల గుట్టను సందర్శించిన పరమానందజీ మహరాజ్



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్ట ను మంగళవారం పరమానంద్‌జీ మహరాజ్ సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అయోధ్య నుంచి వచ్చిన పరమానంద్‌జీ సిద్దేశ్వరునికి పవిత్ర గంగా జలంతో అభిషేకం చేశారు. రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, హనుమాన్ ఆలయల్లో ఆయన పూజ లు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పరమానంద్ మహరాజ్‌ను సన్మానించారు.కార్యాక్రమంలో బి.సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, సంతోష్, జిమ్మిరవి, బట్టుశంకర్ తదితరులు పాల్గొన్నారు.

■ భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

వేల్పూర్: మండలం కుకునూర్ గ్రామంలో మంగళవారం ప్రారంభమైన శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. గ్రామ వైదిక పురోహితులు ప్రశాంత్‌చార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు శ్రీ వేంకటేశ్వరస్వామికి అభిషేకం, అంకురార్పణ, మండప అర్చన, బలిహరణం నిర్వహించారు. ఆలయకమిటీ, గ్రామాభివృద్ధికమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

■ ఘనంగా నల్ల పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన



రుద్రూర్: కోటగిరి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ దేవి ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

అన్నారంలో..

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని అన్నారం లో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు విగ్రహాల ఊరేగింపు నిర్వహించి వేద పండితులు జలాధివాసం పూజ నిర్వహించారు.



క్లుప్తంగా

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



వేల్పూర్: సైబర్ మోసాలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని పోలీసుశాఖ షీటీం సభ్యులు పేర్కొన్నారు. వేల్పూర్ ఉన్నత పాఠశాలలో వారు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, సౌజన్య, సుమతి, రాజ్‌పాల్, హెచ్ఎం రాజన్న, ఇన్‌చార్జి హెచ్ఎం శైలజ, విద్యార్థినులు పాల్గొన్నారు.

డీఈవోకు వినతి



బోధన్: సాలూర మండలంలోని హున్సా గ్రామ మండల పరిషత్ ఉన్నత పాఠశాలను విభజించాలని కోరుతూ మంగళవారం జిల్లాకేంద్రంలోని డీఈవో ఆఫీస్‌లో డీఈవో అశోక్‌కు గ్రామ పెద్దలు వినతి పత్రం అందించారు. హున్సా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను మూడేళ్లక్రితం ఉన్నత పాఠశాల అప్‌గ్రేడ్ చేశారు.అప్పటి నుంచి ఈ పాఠశా లలో 1 నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థుల అడ్మిషన్స్, బోధన కొనసాగుతుంది. ప్రాథమి క, ఉన్నత పాఠశాల వేర్వేరుగా ఏర్పాటు అయి తే పాఠశాల నిర్వహణ, పర్యవేక్షణ, విద్యాబోధన సులభమవుతుందని గ్రామస్థుల సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే పాఠశాల విభజన ప్రక్రియ పూర్తి అవుతుందని డీఈవో హామీ ఇచ్చారని గ్రామ పెద్దలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం



వేల్పూర్: మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పోచంపల్లిని మోడల్ గ్రామంగా ప్రభుత్వం గుర్తించిన విషయం విదితమే. దీంతో అధికారులు కొన్ని ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా హౌగ్ పీడీ ప్రభు, ఎంపీడీవో బాలకిషన్, ఏఈ సత్యనారాయణ, జీపీ కార్యదర్శి సమత, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు..



పెర్కిట్(ఆర్మూర్): మండలంలోని అంకాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మార చంద్ర మోహన్ మంగళవారం ప్రారంభించారు. నిర్మాణ పనులకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.లక్ష మంజూరు అయ్యాయి.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మట్ట అమృత్ రావు, మాజీ ఎంపీటీసీ గంగా రెడ్డి, గోపాల్, ఆరేపల్లి గంగామోహన్, ఆలయ కమిటీ సభ్యులు కిషన్, భీమయ్య, రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో మంగళవారం రోటరి క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో 10మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేసినట్లు రోటరీ అధ్యక్షుడు రజనీష్ కిరాడ్ అన్నారు. మహిళలకు రోటరీ ద్వారా ప్రతి ఏడాది 5వేలు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యాక్రమంలో రోటరీ సభ్యులు చరణ్‌రెడ్డి, పుష్పాకర్‌రావు, ఆనంద్, శశిధర్, తులసికుమార్ పట్వారి, రాధాకిషన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిజిటల్ స్కిల్స్‌పై అవగాహన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం డిజిటల్ ఈక్విటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



బోధన్‌లో సిబ్బందిని సన్మానిస్తున్న డీఈ ఎండీ ముక్తార్

బోధన్‌రూరల్/వర్ని/ ఎడపల్లి: విద్యుత్ సిబ్బంది మరమ్మతుల సమయంలో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని బోధన్ ట్రాన్స్ కో డీఈ ఎండీ ముక్తార్ సూచించారు. మంగళవారం విద్యుత్ లైన్‌మెన్‌ల దినోత్సవాన్ని పట్టణంలో బెల్లాల్ విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో, వర్ని మండలంలోని జలాల్పూర్, ఎడపల్లి సబ్‌స్టేషన్లలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్ ఉద్యోగులను సన్మానించారు. డీఈ ఎండీ ముక్తార్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఈ నగేష్ కుమార్, కన్స్‌ట్రక్షన్ ఏడీఈ తోట రాజశేఖర్, వర్ని ఏఈ శ్రీనివాస్, ఏడీఈ ప్రభాకర్, ఎడపల్లి ఏఈ కిషోర్ రెడ్డి, ఏఈ సుమిత, సబ్ ఇంజనీర్ బాలకిషన్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఏఈ నాయిని కృష్ణ, విద్యుత్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రవేశం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

బోధన్: ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు మంగళవారం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం నుంచి ప్రారంభం కానున్నా పరీక్షలు ఈ నెల 20 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. పరీక్షా సమయం ఉంటుంది. పట్టణంలో మొత్తం 9 పరీక్ష కేంద్రాలున్నాయి. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష గదిలో తాగు నీటి సౌకర్యం కల్పించారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

ఆర్మూర్‌టౌన్: ఫోన్లు పోగొట్టుకున్న ఎనిమిది మంది బాధితులకు ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి అందజేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ మంగళవారం తెలిపారు. బాధితులు ఫోన్ పోయినట్లు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి ఫోన్లను అందించినట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం రాంపూర్ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈమేరకు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు ఫోన్లు, మూడు బైక్‌లు, రూ.45,110 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



నాప్‌కిన్ మిషన్లు అందిస్తున్న జిల్లా జడ్జి సునీత

ఎడపల్లి(బోధన్): విద్యార్థినులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. మండలకేంద్రంలో జిల్లా లీ గల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శానిటరీ నా ప్‌కిన్, వెన్డింగ్ మిషన్లపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అనంతరం విద్యార్థినులకు నాప్‌కిన్ మిషన్లు అందజేశారు. మండల కేంద్రంలోని రిటైర్డ్ టీచర్ స రోజమ్మ తొమ్మిది బాలికల గురుకుల పాఠశాలలకు నాప్క్విన్, వెన్డింగ్ మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి, బోధన్ జడ్జి రవికుమార్, టీచర్లు తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి సృజన టెక్నికల్ ఫెస్టివల్



సోలార్ సిస్టంను వివరిస్తున్న విద్యార్థులు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జిల్లాస్థాయి సృజన టెక్నికల్ ఫెస్టివల్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. సాంకేతిక ప్రదర్శనలో భాగంగా మెకానిక్ ఇంజినీరింగ్ డిప్లమా విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించి, వాటి పనితీరును వివరించారు. జిల్లాలోని నందిపేట, కోటగిరి, నిజామాబాద్, నవీపేట, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించి విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా లక్కంపల్లి గ్రామ శివారులోని ఫుడ్ పార్క్ పరిశ్రమ మేనేజర్ ఎం.సతీష్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించి రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ప్రిన్సిపల్ ఎస్.రాజ్‌కుమార్, విభాగాధిపతులు కిషోర్, లావణ్య, లక్ష్మణ్ శాస్త్రి, పరిపాలన అధికారి తులసీరామ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.15, శబ్దం (తెలుగు) - 1.35, సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) -4.40, అగత్యా(తెలుగు)-7.50, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.40
స్క్రీన్-2	శబ్దం(తెలుగు)-10.05, ఛావా (హిందీ) -1.10, 7.35, 10.55, మజాకా (తెలుగు) -4.30
స్క్రీన్-3-	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.10, మజాకా(తెలుగు)-1.20, గ్యాంగ్స్ ఆఫ్ వేస్ పూర్(హిందీ)-4.25, శబ్దం(తెలుగు)-7.40, 10.45
స్క్రీన్-4	నేనెక్కడున్నా(తెలుగు)-10.45, గార్డ్(తెలుగు)-1.25, ఛావా(హిందీ)-4.00, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.20, మజాకా(తెలుగు)-10.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-11.00, 4.40, 7.30, 10.20, అగత్యా(తెలుగు)-1.40
స్క్రీన్-2	అగత్యా(తెలుగు)-11.00, 4.40, మజాకా (తెలుగు) - 1.45, 7.35, 10.30
స్క్రీన్-3	గార్డ్(తెలుగు)-10.50, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-1.40, 7.30, శబ్దం (తెలుగు)-4.40, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.05, మజాకా (తెలుగు) - 1.25, టర్న్ ఆఫ్‌ది డ్రాగన్ (తెలుగు)-4.30, 7.40, 10.50
స్క్రీన్-2	సందీప్‌కిషన్ మజాకా(తెలుగు)- 10.00, 4.15, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)- 1.05, ఛావా(హిందీ)-7.20, 10.40
స్క్రీన్-3	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-9.40, ఛావా(హిందీ)-12.50 తండేల్(తెలుగు) - 4.10, 10.20, మజాకా(తెలుగు) - 7.15
స్క్రీన్ -4	ఓయ్(తెలుగు)-10.05, జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-1.30, ఛావా(హిందీ)-4.20, సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40, మజాకా(తెలుగు)-10.40
లలితామహల్	తండేల్
దేవి	మజాకా
నటరాజ్	ఛావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	130
		లైవ్	80
స్కిన్‌లెస్	150	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,200	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	81,900		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

కరపత్రాల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం వాణిజ్య శాస్త్ర విభాగం కార్యశాలకు సంబంధించిన కరపత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ వేణుప్రసాద్ ఆవిష్కరించారు. ఈనెల 11న కళాశాలలో నిర్వహించిన వాణిజ్యశాస్త్ర విభాగం కార్యాశాలకు టీయూ కామర్స్ డీన్, రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ జి.శ్రీనివాస్‌లు రానున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులకు వాణిజ్యశాస్త్ర విభాగంపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈకార్యాక్రమంలో వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి డా. లింగన్న, శ్యామ్‌కుమార్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఏర్గట్ల రాజు భాయి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పోచన్న, వినోద్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కే భూమన్న మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలపై భయం వీడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, చేపూర్ హెచ్ఎం చేతన కుమారి, కానిస్టేబుల్ సుమంత్, ఉపాధ్యాయులు రవి, అశోక్, వినోద్, గంగాధర్, హెచ్ఎం లక్ష్మీ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం విరాళాల సేకరణ

వేల్పూర్: హైదరాబాద్‌లోని ఐటీఆర్ఆర్ఓడీడీడీ సోచ్ సంస్థలో దివ్యాంగుల కోసం వేల్పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు మంగళవారం విరాళాలు సేకరించారు. రూ. 14808 సేకరించి, ఆ సంస్థ రాయబారి వెంకటేశ్వర్లుకు స్కూలు హెచ్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అందజేశారు. కరస్పాండెంట్ నాగరాజు, భోజన్న, డైరెక్టర్ పిల్లమారి నరేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

రెంజల్(బోధన్): వేసవిలో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్ సూచించారు. మంగళవారం మండలంలోని దూపల్లి ఉపాధి పనులను పరిశీలించారు. 56 మంది కూలీలు మాత్రమే పనులకు రావడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకునాలని వివరించారు. కూలీలతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలి

ఆర్మూర్‌టౌన్: బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం పోస్ట్‌కార్డ్స్ ద్వారా ఉత్తరం రాశారు. బడ్జెట్‌లో విద్యరంగానికి 20శాతం నిధులు కేటాయించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన, చలో అసెంబ్లీ కార్యాక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యాక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు హుస్సేన్ రాహుల్, కళ్యాణ్, సాయి, అక్షయ్, నిఖిల్, భువనేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

వేల్పూర్: వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలోని 15వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో బాలకిషన్ మంగళవారం తనిఖీ చేశారు. పిల్లలు ఎంతమంది హాజరైంది పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేసే ఆహారపదార్థాలను పిల్లలకు అందించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు జాతీయ అంధత్వ నివారణ పథకంలో భాగంగా మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు సూర్యనారాయణ, గురురాజ్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈశిబిరాన్ని ఎంఈవో జక్కుల రవి పర్యవేక్షించారు.